


రేపు వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలను ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె కవిత మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా ఆటల పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో ఆటల పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో జిల్లాలో గల విభిన్న ప్రతిభావంతులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 5న 3 గంటల నుంచి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఆమె చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు.

అంతర్ రాష్ట్ర రోడ్డు పనుల్లో డొల్ల

- కానరాని అధికారుల పర్యవేక్షణ
- గతంలో రోడ్డుపైకి నీరొచ్చి గోతులు ... ఇప్పడూ అదే పరిస్థితి



కూనేరు వద్ద రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి - కొమరాడ

గత మూడేళ్లుగా అధ్వానంగా తయారైన అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణించాలంటే బిక్కుబిక్కు మంటూ ప్రయాణించాల్సిందే. అయినా అనేక ప్రమాదాల జరుగుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించేవారు. దీంతో సిపిఎం, ప్రజా సంఘాలు రోడ్డు మరమ్మతలు చేయాలని వివిధ రూపాయాల్లో ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అంత వరకూ బాగానే ఉంది. అయితే జరుగుతున్న మరమ్మతు పనుల్లో పూర్తిగా డొల్లతనం కనిపిస్తోంది.

అంతర్రాష్ట్ర రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్న సందర్భంలో ఆశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు తన ఇష్టానుసరంగా పనులు చేపడుతున్నారు. ఈ పనులు చూసేవారు మూడు నెలలకే రోడ్లు మళ్లీ గోతులుగా మారే అవకాశం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో మండలంలోని సుమారు 14 ప్రదేశాల్లో అంతరాష్ట్ర రహదారిపై భారీ గోతులు ఏర్పడి రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురైంది. ముఖ్యంగా ఈ రోడ్డు మరమ్మతులకు గురవ్వడానికి ప్రధాన కారణం అంతర్రాష్ట్ర రహదారిపైకి వర్షం నీరుతో పాటు పక్కనే గ్రామాల్లో వాడుక నీరు రోడ్డుపై చేరడంతో తారు రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారాయి. ప్రభుత్వం ఇటీవల కాలంలో కొంత నిధులు కేటాయించి రోడ్డు పనులు చేయిస్తున్నప్పటికీ కాలువల్లేకపోవడంతో మళ్లీ వర్షం నీరు, గ్రామాల్లో వాడకనీరు రోడ్డుపైకి చేరుతుంది. ఈ నీటిని దారి మళ్లించకుండా కనీసం రహదారికి ఇరువైపులా కాలువలు కూడా తీయకుండా తూతు మాత్రంగా మరల రహదారి మరమ్మతులు చేపట్టడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం నుంచి కునేరు అంతర్ రాష్ట్ర రహదారిపై గత నెల రోజుల నుంచి రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. సుమారు 25 కిలోమీటర్ల మేర 20 గోతుల వరకు ఏర్పడడంతో ఇటీవల కాలంలో వాహనదారులు రాకపోకలకు కష్టతరంగా మారాయి. దీంతో ప్రభుత్వం మొదటి విడత సుమారు కోటి రూపాయలకు పైగా మంజూరు చేసి పెద్ద గోతులను మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. దీంతో ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోడ్డు పనులు ప్రారంభించారు. పెద్దపెద్ద గోతులైనచోట కొన్ని ప్రదేశాల్లో రోడ్డును ఎత్తు చేసి బిటి రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నారు. పనులు చేస్తున్న ప్రదేశాల్లో గతంలో మురికి నీరు రోడ్డుపైకి వచ్చి భారీ గోతులు ఏర్పడడానికి ప్రధాన కారణమైనప్పటికీ అక్కడ కనీసం మళ్లీ రోడ్డుపైకి నీరు రాకుండా ఎటువంటి చర్యలు చేపట్టకుండా పనులు చేస్తుడడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎబి సరిహద్దు ప్రాంతం కూనేరు వద్ద అంతర్రాష్ట్ర రహదారిని కొంతమేరకు ఎత్తి చేసినప్పటికీ కూనేరు గ్రామస్తులు వాడుక నీరు బయటికి వెళ్లేందుకు దారి తీయకుండానే రోడ్డు పనులు చేపట్టడంతో ఆ వాడిక నీరు మళ్లీ రోడ్డుపైకి చేరుతుంది. దీంతో తారు రోడ్డు వేసినప్పటికీ మరల వారం రోజులకే అక్కడ గోతులయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా నీరు బీటీ రహదారి పైకి రావడంతోనే అక్కడ గోతులయ్యాయని అలాంటిది మళ్లీ కాలువలు తీయకుండానే రోడ్డు పనులు చేపట్టడంపై ప్రయోజనం ఉండదని వాహనదారులు అంటున్నారు. అలాగే గంగరేగువలస, కొమరాడ, కూనేరు ప్రాంతాల్లో కనీసం రోడ్డుకిరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు దారి మళ్లించకుండా రోడ్డు పనులు తూతూ మాత్రంగా చేపట్టడంపై పలువురు ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. రోడ్డు పనులు జరుగుతున్న ఆర్అండ్‌బి అధికారులు పర్యవేక్షణ తూతూ మాత్రంగా ఉండడంతో గుత్తేదారు తన ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన రోడ్డు పనులను చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

డిప్యూటీ సిఎంను కలిసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు



డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు సమస్యలను వివరిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ న్యాయమైన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ ఎదుట జరుగుతున్న దీక్షా శిబిరం మంగళవారం 14వ రోజు కొనసాగింది. వీరి దీక్షలకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, చెరువులు సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం వారికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరంతా అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకులని, వారిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించడానికి అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. ఎన్నడూ లేని విధంగా జోనల్ పోస్టులైన గురుకుల ఉపాధ్యాయ పోస్టులు డిఎస్సీలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సరస్వతి, లక్ష్మి, జ్యోతి, కన్నమ్మ, ఇందిర, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఎపి గిరిజన సంక్షేమ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్లు నాయకులు మంగళవారం విజయవాడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కలిసి తమ సమస్యలు విన్నవించారు. 15 ఏళ్లుగావిధులు నిర్వహిస్తున్న తమను కాంట్రాక్టు లెక్చరర్లుగా మార్పు చేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. శాంక్షన్డ్ పోస్టుల్లోనే తాము ఏళ్ల తరబడి పని చేస్తున్నామని, అతి తక్కువ జీతాలతో ఇస్తూ తమ శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పట్ల పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. పూర్తి పరిశీలన నిమిత్తం సంఘం నాయకులను ప్రత్యేకంగా పిలిచి మాట్లాడారు.

ట్రైబల్ ప్రిన్సిపల్ సెక్రటరీకి జాతీయ ఎస్‌టి కమిషన్‌కు నోటీసు

ఎపి గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఆప్కోస్‌లో కొనసాగిస్తూ మినిమం టైం స్కేల్ అమలు పర్చకుండా, కనీసం సిఆర్‌టిలుగా పరిగణలోకి తీసుకో కుండా తీరని అన్యాయం జరుగుతుందని జాతీయ ఎస్టి కమిషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జాతీయ కమిషన్ నుంచి ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్లు ఆదివాసి జెఎసి నాయకులు బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నోటీసులు వల్ల గిరిజన గురుకుల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాఠశాలకు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలో వేద పాఠశాలకు స్థలం కేటాయించాలని బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు దార్లపూడి లక్ష్మీనారాయణ శర్మ, కామేశ్వరరావు, బుజ్జి తదితరులు నగరపంచాయితీ సమన్వయకర్త పల్లా కొండలరావును కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు.

ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : పిఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి



పిహెచ్‌సిలో మందులను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ వైద్యాధి కారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. వైద్యశాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు గురించి అక్కడ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు పరిశుభ్ర వాతావరణం కనిపించాలని, ఆ దిశగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. రోగులకు అందించే మందులు నిత్యం అందుబాటులో ఉంచుకోవాలని, ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగాలని, రక్తహీనత లోపం లేకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం మేనేజర్ డా. టి.జగన్మోహనరావు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిడిఆర్‌సి సమావేశం ఎప్పుడో?

అన్ని జిల్లాల్లోనూ పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యాన నిర్వహించాల్సిన సమావేశాన్ని ఇంత వరకు నిర్వహించలేదు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుని జిల్లా ఇంఛార్జి మంత్రిగా నియమించి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఇంతవరకు ఆయన జిల్లాలో అడుగు పెట్టలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అసెంబ్లీ సమావేశాలు కారణంగా ఆయన రాక ఆలస్యమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రాలోని అన్ని జిల్లాల్లోనూ అభివృద్ధి సమీక్షా సమావేశాలు జరిగిపోయాయి. జిల్లా ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గిరిజన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒకేసారి ఐటిడిఎ పాలకవర్గ సమావేశం జరిగింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు కావస్తోంది. ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ప్రస్తావన లేదు. జిల్లాలో గల రెండు ఐటిడిఎలకూ రెగ్యులర్ పిఒలు లేరు. పార్వతీపురం ఐటిడిఎకు సంబంధించి గిరిజన సంక్షేమ డిడి పోస్ట్ ఖాళీగా ఉంది. ఇవి ఐటిడిఎలో కీలకమైన పోస్టులు గత కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌ఛార్జి అధికారులతో జిల్లా పరిపాలన జరుగుతుండడంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఎంఎస్ఎంఇ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంఎస్ఎంఇ సర్వేపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇండస్ట్రీ ప్రమోషన్ అధికారి పి.దిలీప్‌కుమార్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై సర్వే చేసి గుర్తించాలన్నారు. చిన్న వర్తకులకు ప్రభుత్వం తరపునుంచి వచ్చే అవకాశాలు చేరడం కోసం తప్పనిసరిగా ఈ సర్వేలో వారి వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు : జెసి

ప్రజాశక్తి - కొమరాడ

రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుణానపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం, ఎఫ్టీఓ జనరేషన్ చేసే విధానాన్ని ఆమె స్వయంగా పరిశీలించి గ్రామ వ్యవసాయ సహాయకులకు, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఒక్కో కేంద్రానికి ముగ్గురు చొప్పున తాత్కాలిక సిబ్బందిని నియమించామని వివరించారు. కంప్యూటరీకరణ, ట్రాక్ షీట్లు, మిల్లులకు ధాన్యం తరలింపు, తేమశాతం తెలుసుకోవడంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తూ, శిక్షణ కూడా ఇచ్చినట్లు చెప్పారు. రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురికారాదనే ప్రభుత్వం ఇన్ని ఏర్పాట్లు చేసిందని, అందుకు తగిన విధంగా సిబ్బంది నడుచుకోవాలని తెలిపారు. పర్యటనలో విఎఎలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు భవనాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఉన్నతమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో అదనపు భవనాలను నిర్మించి విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఏ విధంగా చదువుతున్నారు, వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, ఎంఇఒ చంద్రశేఖర్, ఎటిడబ్ల్యుఒ సురేష్, హెచ్‌ఎం స్వాతి, టిడిపి మండల అధ్యక్షులు సుదర్శనరావు, అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కృష్ణబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో చేపడుతున్న అంగన్వాడీ కేంద్రాల్లో పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఐసిడిఎస్ పిఒ, సిడిపిఒ, ఎంపిడిఒలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులు, పోషణ్ వాటిక నిర్వహణ ప్రగతిపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రానికి లోపల, వెలుపల అందమైన రంగులు వేయించడంతో పాటు కేంద్రానికి బోర్డు, అందమైన చిత్రాలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్, వైట్ బోర్డు, ఆట పరికరాలు, పాఠ్యపుస్తకాలు, కుర్చీలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్డి, రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఇందుకోసం ఆర్‌డబ్ల్యుఎస్ వారికి నిధులు మంజూరు చేశామని, వాటిని ఎంపిడిఒలు పొంది పనులు వేగవంతం చేయించాలని కోరారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన విద్య, పోషకాలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, వాటిని సక్రమంగా అందించే బాధ్యత సిడిపిఒలదేనని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి అందంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీచేశామని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటిక అమలుచేయాలని, ఇందుకు అవసరమైన పంటలు, మొక్కల విత్తనాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలను శ్రద్ధతో కేంద్రాలకు పంపించేలా అంగన్వాడీలు రూపుదిద్దు కోవాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం మునుపటి కంటే పెరగాలని, ఆ దిశగా కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, సూపర్ వైజర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షల నమోదును పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలకు స్పందన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలకు అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఐటిడిఎ పరిధిలోని 20 మండలాల్లో ఇటీవల నిర్వహించిన సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షల్లో పాజిటివ్ వచ్చినవారికి హెచ్‌పిఎల్‌సి పరీక్షలు విశాఖ కెజిహెచ్‌లో నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి కెజిహెచ్ వారు పాజిటివ్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారని పిఒ తెలిపారు. ఆ సర్టిఫికెట్‌తో ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు ఫించన్‌కు అర్హత పొందుతారనితెలిపారు. ఈ పరీక్షలకు సుమారు 220 మంది రోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, వెలుగు డిపిఎం రమణ, ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి, సిఎంఒ చిరంజీవులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల ప్రణాళికను సవరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పదోతరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన వందరోజుల ప్రణాళికను సవరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో కోరారు. డిసెంబర్ 20నాటికి పదోతరగతి సిలబస్ పూర్తవుతుందని, ఇప్పటికే విద్యాశాఖ జిల్లా అధికారులు నిర్దేశించిన డాట్, గ్రాండ్ టెస్ట్‌లను అమలు చేస్తున్నామని తెలిపారు. అయితే ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలనడం వల్ల ప్రయోజనమేమీ ఉండదని, దీనివల్ల వారిపై మానసిక ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం పదోతరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వందరోజుల ప్రణాళికను సవరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఆ ప్రకటనలో కోరారు.

పిహెచ్‌సిలను డిఐఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గల మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డిఐఒ ఎం.నారాయణరావు మంగళవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో గ్రామాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎఎన్‌ఎంలు, ఐసిడిఎస్ సూపర్వైజర్‌తో మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు వేయాల్సిన వ్యాక్సిన్లు, ఇమ్యూనైజేషన్ ఇంజక్షన్లు, రేషలైజేషన్ టీకాలు సక్రమంగా వేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి : డిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


రసాయన, ప్రకతి వ్యవసాయం సాగులో వ్యత్యాసాల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని పెద్దఖర్జ పంచాయితీ మంగళాపురం, డుమ్మంగి పంచాయతీ గుణదలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రసాయన వ్యవసాయంలో భూసారం, పంట దిగుబడి తగ్గి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రసాయన వ్యవసాయం వల్ల వాతావరణంలో మార్పులు కూడా మారుతాయని, సీజన్ వారీగా వర్షాలు పడే అవకాశం తగ్గుతుందని వివరించారు. దేశీ విత్తనం, అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగు, 365 రోజులు భూమిని పలు పంటలతో వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరుగుతుందని అన్నారు. భూమిలో నత్రజని శాతం పెరిగి సూక్ష్మజీవులు ఎక్కువ శాతం అభివృద్ధి చెందడం వల్ల రైతులకు పంటలు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుత రబీ పంటల్లో అపారాలైన మినుములు, పెసలు, ఉలవలు, నువ్వులు, రాగి, వేరు శనగ పంటలు ప్రధాన పంటలుగానూ, అందులో అంతర పంటలుగా జొన్న, బెండ, గోంగూర, తోట కూర, ఆవాలు పంటలు, గట్లపై చిక్కుడు, ఆముదం జీవ వైవిధ్య పంటలు వేయవచ్చని తెలిపారు. ఏక పంటలుగా కాకుండా పలు పంటలు వేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. వీటి వల్ల భూమిలో నత్రజని, సూక్ష్మ జీవులు ఎక్కువ శాతం అభివృద్ధి చెంది భూసారం కూడా పెరుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. జీడి మామిడి యాజమాన్య పద్ధతుల్లో అంతర్ పంటలుగా పసుపు, పైనాపిల్, అల్లం వేసుకోవచ్చన్నారు. అలాగే జూన్, జులైలో కొమ్మ కత్తిరింపులు, ట్రెంచిస్, పువ్వు మాడకుండా పుల్లటి మజ్జిగ, పంచగవ్య ద్రావణాల వాడకంపై రైతులకు వివరించారు. కార్యక్రమం వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు, విఎఎస్ విజయ్, మనోజ్, ఎంటిఎల్ గణేష్, శరత్ చంద్ర, ఎల్ఐఎన్ ఢిల్లేశ్వరరావు, విఎఎలు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించేలా వైద్య సిబ్బంది పని చేయాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సూచించారు. మండలంలోని లోవ ముఠా ప్రాంతంలో గల రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. మారుమూల ప్రాంతం కావడంతో 24 గంటలు వైద్య సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైరల్ ఫీవర్లు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేకు 104 ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి సోమవారం వినతి పత్రం అందించారు. 104 సర్వీసులను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా నియమించి సుదీర్ఘంగా సేవలందిస్తున్న 326 మంది సీనియర్ డ్రైవర్లను ఇతర వైద్య శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, అదే విధంగా 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. 2020లో విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులకు భద్రత కల్పించి జిఒ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. అరబిందో యాజమాన్యం నిర్లక్షంగా వ్యవహరించి ఇవ్వకుండా ఉన్న ఇంక్రిమెంట్లు ఎరియార్ల రూపంలో ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అరబిందో యాజమాన్యం వాటా యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిఒ 44, 59 ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ గతంలో పాత యాజమాన్యమే కట్టేదని, 104 ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని, వాహనాల ఫిట్, ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలని, తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 సిబ్బంది సూర్యనారాయణ, మురళీ, తేజ, ప్రేమ్ కుమార్ ఉన్నారు.



ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మొండెంఖల్‌లో ఇంటింటి సర్వే

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో రోజు రోజుకు వైరల్ ఫీవర్‌తో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి జ్వరాలు అధికమవుతున్నాయి. ఈ మేరకు మొండెంఖల్‌లో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారని, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సర్వే చేసి రక్త పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారని సోమవారం 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. ఈ మేరకు మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది స్పందించి మంగళవారం నాడు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితుల సర్వే చేసి, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనుమానంగా ఉన్న వారి రక్త నమూనాలను జిల్లా ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సిఎంకు వీరేష్ చంద్ర దేవ్ వినతి

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ అభివృద్ధిపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని మంగళ గిరిలో మంగళవారం కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని దీర్ఘకాలిక సమస్యలు వివరించి వెనకబడిన గిరిజన నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాలకు కనీస మౌలిక వసతులైన తాగునీరు, విద్య, వైద్యం, రహదారి సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పర్చాలని కోరగా, అందుకు సిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సమస్యలపై విప్ హరి ప్రసాద్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ సమస్యలపై జనసేన రాజకీయ వ్యవహారాల కార్యదర్శి శాసన మండలి సభ్యులు పసుపులేటి హరిప్రసాద్‌ను మంగళగిరిలో జనసేన కార్యాలయంలో మంగళవారం జనసేన నియోజకవర్గం ఇన్చార్జి కడ్రక మల్లేష్, ఐదు మండలాల జనసైనికులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్నటువంటి చెక్ డాములు, రిజర్వాయలు, తాగునీటి సమస్యలు, గిరిజన ప్రజలకు మౌలికవసతులైన విద్య, వైద్యం తదితర సమస్యలపై వినతి అందించామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసైనికులు ఎన్.వంశీ, తెంటు శ్రీకర్, వారణాశి శివకుమార్, రాజాన పవన్ తదితరులు పాల్గొన్నారు.

'భారతి ఇంటర్నేషనల్'లో చదువుతో పాటు క్రమశిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతో పాటు క్రమశిక్షణ ఉంటుందని కోల్‌కత్తాకు చెందిన ఇన్‌కంటాక్స్ కమిషనర్ జె.మురళి అన్నారు. మంగళవారం అదనపు ఆయన ఆ పాఠశాల భవనాన్ని ప్రారంభించి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆయన మాట్లాడి వారికి బాలమిత్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ చదువులో మంచిగా కొనసాగించాలని కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏజెన్సీలో ఇలాంటి పాఠశాల ఉండడంతో విద్య ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. విజయనగరం, విశాఖ వంటి పట్టణాలు వెళ్లకుండా మన ప్రాంతంలోనే ఇలాంటి పాఠశాల ఏర్పాటు చేయడం శుభపరిణామమని చెప్పారు. ఇక్కడ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ ఇన్‌కం టాక్స్ కమిషనర్ జె.సిరికుమార్, వాల్మీకి శ్రేయ సంస్థ అధ్యక్షులు ఎస్పీ పెంటయ్య, స్కూల్ ప్రిన్సిపల్ నవీన్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపు మనదే కావాలి

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 8న జరగనున్న నీటి సంఘం ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు అంతా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానికంగా ఒక ప్రయివేట్ కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని నీటి సంఘాలను కైవసం చేసుకునేలా అభ్యర్థుల ఎంపిక చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని కార్యకర్తలకు సూచించారు. ప్రతి సంఘం పరిధిలో 6 ప్రాదేశికాలు ఎన్నిక జరుగుతుందని, ఆ సభ్యుల్లో ఉత్తీర్ణులైన మన మద్దతుదారులే ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మక పాండు, కర్నేన అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు సంతోష్, తూర్పు కాపు సంఘం డైరెక్టర్ గండి రామినాయుడు, గర్నాన సత్తిబాబు, టిడిపి నాయకులు తేజోవతి ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్య సాగుతో అధిక లాభం

ప్రజాశక్తి - భామిని

ఐటిడిఎ ద్వారా చేప పిల్లలు ఉచితంగా పంపిణీ చేసి మత్స్య సాగు ప్రోత్సాహిస్తున్నాయని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ తెలిపారు. మత్స్య సాగుతో రైతులు మంచి ఆదాయం పొందాలని పోషింకోట సర్పంచ్ బిడ్డిక నారాయణరావు అన్నారు. మండలంలోని బురుజోల పంచాయతీ పరిధిలోని 3 చెరువుల్లో 11600 చేప పిల్లలు, మండ్రిగూడ చెరువులో 15వేల చేపపిల్లలను, జక్కరగూడలోని రెండు చెరువుల్లో 7,100 చేప పిల్లలను మంగళవారం వదిలారు.

అంటిపేట, కాశీపేటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట, కాశీపేటలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ పెసలు, మినుములు, ఉలవ మొక్కలకు తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే ఇప్పటివరకు 18 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు అంగీకారం

కొలతలు వేసిన పిఆర్ డిఇ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో నడిమివీధి సమస్య పరిష్కారానికి పలుమార్లు అధికారులు గ్రామస్తులను ఒప్పించే ప్రయత్నం గతంలో చేయగా ఓ కొలిక్కి రాలేదు. దీంతో మళ్లీ మంగళవారం గ్రామ పెద్దలు, నడుమ వీధి, గ్రామ ప్రజలతో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, పంచాయతీరాజ్ డిఇ చిన్నంనాయుడు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. నడిమివీధి ప్రజలతో మాట్లాడుతూ శంబర పోలమాంబ జాతర ఒక్క ఊరుకే సంబంధించినది కాదని, రాష్ట్ర గిరిజన జాతరగా అవతరించిన నేపథ్యంలో మరింత మంది భక్తులు పెరిగే అవకాశం ఉన్నందున అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన ప్రభుత్వానికి సహకరించాల్సిందిగా తహశీల్దార్ గ్రామస్తులకు తెలిపారు. గ్రామ కంఠం భూముల్లో ఉన్న ఇళ్లపై పూర్తిగా పంచాయతీకే అధికారం ఉంటుందని గ్రామస్తులకు తెలిపారు. కొంతమంది రెచ్చగొట్టే మాటలు విని ఎవరూ గొడవలకు దిగొద్దని ఆయన సూచించారు. అందరూ అభివృద్ధికి సహకరించాలని లేదా అభ్యంతరంతో ఉంటే తమ హక్కులను తమకు చూపించాల్సిందిగా ఆదేశించారు. సమావేశం అనంతరం రహదారిపై కొలతలకు ఉపక్రమించారు. సుమారు 8.60 మీటర్ల వెడల్పుతో 200 మీటర్ల పొడుగుకు కొలతలు వేశారు. ఒకటి, రెండు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు డిఇ చిన్నంనాయుడు అన్నారు. ఇప్పటికే రహదారి కొలత సమస్యతో ఒక కొలిక్కి వచ్చినట్లు అంతా భావిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ బూరి రజిత్, పోలీస్ సిబ్బంది, ఉప సర్పంచ్ ఎ.వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, అక్కాన తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి - పాచిపెంట



రోడ్డు సౌకర్యం లేక పింఛను కోసం వృద్ధురాలిని డోలిపై తీసుకొస్తున్న గిరిజనులు

స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్ళు దాటినా అనేక గిరిజన గ్రామాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక నేటికీ డోలీ మోతలు తప్పడంలేదు. ఇందుకు నిదర్శనం పాచిపెంట మండలంలోని పలు గిరిజనులే గ్రామాలే. మండలంలోని గొట్టూరు పంచాయతీ రిట్టలపాడు గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణానికి రెండు దశాబ్దాలుగా అధికారులకు విన్నవించుకున్నా నేటికీ మోక్షం కలగలేదని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సేపి మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను కోసం కొండ దిగి కిందకి రావాలన్నా, నిత్యవసర వస్తువుల కోసం వెళ్లాలన్నా రిట్టలపాడు గ్రామస్తులు అవస్థలుపడాల్సిందే. అనారోగ్యం చేసినా, అత్యవసర సమయాల్లో డోలీలతో కొండ కిందికి మోసుకొని రావాలని, లేకుంటే మరణం తప్పదని అన్నారు. గిరిజనులకు అవగాహన లేక వైద్యం పట్ల ఎటువంటి ఆలోచన లేక మూఢనమ్మకాలతో పసరమందులు, సంచివైద్యులను ఆశ్రయించి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కోసం వృద్ధులు, వికలాంగులు డోలీలు పెట్టి కిందకి రావాల్సివస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం కె.అమ్మ అనే వృద్ధురాలిని డోలీపై వర్షంలో తడుచుకుంటూ కొండలు రాళ్లు దాటుకుంటూ ఇబ్బందులు పడుతూ మైదాన ప్రాంతానికి రావల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రిట్టలపాడు గ్రామం నుండి ఆలూరు జంక్షన్‌కు మూడుకిలోమీటర్లకు పైగా నడవాలి. అనేకమంది పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల గిరిజన గ్రామాల యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

నకిలీ నియామక ఉత్తర్వులపై విచారణ : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అటెండర్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేయడంపై విచారణ జరిపించాలని ఆదేశిస్తూ ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ నియామకాలపై కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీ మాతా ఎల్లమాంబ సర్వీస్, చిల్డ్రన్ డెవలప్మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థలు అటెండర్ ఉద్యోగాల భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశాయి. ఒక్కో ఉద్యోగానికి రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆ ఏజెన్సీలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకుల ఫిర్యాదుపై కలెక్టర్ శ్యాంప్రసాద్ స్పందించి విచారణ జరిపి నివేదిక అందించాలని ఐటిడిఎ పిఒను ఆదేశించారు. ఈ మేరకు పిఒ, ఎపిఒ, గిరిజన సంక్షేమ డిడి, డిప్యూటీ డిఇఒతో కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మన్యానికి మొండిచేయి చూపుతున్నా పట్టించుకోరా?

ప్రజాశక్తి - మక్కువ

పార్వతీపురం మన్యం జిల్లాకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తాము చెప్పిందే నేడు నిజమవుతుందని వారి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గిరిజన యూనివర్సిటీ మార్పు చేయడాన్ని నిరసిస్తూ మంగళ వారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వం గిరిజన ప్రాంతానికి యూనివర్సిటీని కేటాయించి పనులు కూడా ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఈ ప్రాంతంలోనే గిరిజన యూనివర్సిటీ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.ప్రభాకర్, రామారావు, కృష్ణ పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి - కొమరాడ



వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యుఒలు

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ఐదు నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక పిహెచ్‌సి వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో నిరసన మంగళవారం చేపట్టారు. నిరసన అనంతరం ఫార్మాసిస్ట్ బి సీతారాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు సాంబమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజు తమకు పని భారం బాగా పెరిగిందని, పనికి తగ్గట్టు వేతనం ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికే ఐదు నెలలు బకాయి కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. ఒకవైపు నిత్యవసర వస్తువులు రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో మరోవైపు చాలీచాలని జీతంతో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని అన్నారు. కావున వెంటనే పెండింగ్ నేటి వరకు ఉన్న జీతాలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.12వేలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాజకీయ వేధింపులు ఆపాలని, అర్హులైన వారిని ఆశా వర్కర్లుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని, గుర్తింపు కార్డులతో పాటు యూనిఫారం ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో మరణించిన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియో, ఇంటికొక ఉద్యోగం ఇచ్చి అన్ని ఆదుకోవాలని కోరారు. లేకుంటే ఈ సమస్యలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల యూనియన్ నాయకుల దుర్గ, రాధా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఒక మాట.... అధికారానికి వచ్చాక మరో మాటా?

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్రంలో గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చిన తర్వాత మరో ఒక మాట మాట్లాడడం సరికాదన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐటిడిఎల పరిధిలో గల గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నారన్నారు. అయితే కనీసం అధికారులు గానీ, మంత్రిగానీ వారి సమస్యలపై స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోగా మంత్రి సంధ్యారాణి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మార్చి పలు పార్టీలు, ప్రజాసంఘాల పోరాటాల వల్ల ప్రయోజనం ఉండదని వ్యాఖ్యలు చేయడం అర్థ రహితమని అన్నారు. మంత్రి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సిఐటియు గిరిజన సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంత్రి ప్రతిపక్షం ఉన్న సందర్భంలో ఇక్కడ ఏనుగులు, పూర్ణపాడు-లాభేసు వంతెన సమస్య, తోటపల్లి నిర్వాసితుల సమస్యపై కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి ధర్నా, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదా అని ప్రశ్నించారు. ఆరోజు వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు గుర్తులేదా? అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంఘాలు పార్టీల వల్ల ఏ ప్రయోజనం ఉండదని ఎలా భావిస్తున్నారని అని అన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చూస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న సిఐటియు నాయకులు

పట్టణంలో ప్రధాన రహదారి కిరువైపులా వ్యాపారం చేస్తున్న చిరువ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. పట్టణంలో గల చిల్లర వ్యాపారస్తులంతా సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబుతో కలిసి ఎమ్మెల్యే నివాసగృహానికి మంగళవారం వెళ్లారు. రోడ్డుపై వ్యాపారాలు చేయొద్దని పోలీసులు చెబుతున్నారని, తమ వ్యాపారాలను ప్రధాన రహదారి వైపు చేసుకునేందుకు అవకాశం కల్పించమని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ పార్వతీపురం పట్టణం జిల్లా కేంద్రమైందని, అందుకు తగ్గట్టుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా అందరికీ సరైన స్థలంలో వ్యాపారులు జరిగేలా ఏర్పాటు చేస్తామని, ఎవరూ భయపడొద్దు హామీ ఇచ్చారు. పళ్ల వ్యాపారమంతా ఒకచోట, కూరగాయల వ్యాపారం అంతా ఇంకోచోట ఏర్పాటు చేసుకుంటే కొనుగోలుదారులంతా ఆ ప్రాంతానికి వచ్చి కొనుగోలు చేస్తారని, ఇష్టం వచ్చినట్లు ఇంకెవరైనా రోడ్డుపై విక్రయిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. పార్వతీపురం అభివృద్ధి కావాలంటే ప్రభుత్వం నిధులు అవసరం ఉందని, అందుకు పట్టణాన్ని ప్రణాళికా బద్ధంగా చూపించాలని, అందుకు మీరంతా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. స్థలం చూసే వరకు వ్యాపారాలు చేసుకునేలా పోలీసులతో మాట్లాడుతానని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మీరంతా సహకరించాలని ఆయన సూచించారు.

ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు పెదబొండపల్లి పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన ఆశాడే సమావేశంలో ఆయన మాట్లాడారు. శిశు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు వారి సమీప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగేలా చూడాలన్నారు. హైరిస్క్ ఆరోగ్య సమస్యలను గుర్తించి సమస్యను బట్టి స్పెషలిస్ట్ ఆరోగ్య తనిఖీలు జరిగేలా చూడాలన్నారు. ఆశా కార్యకర్తలు వారు నిర్వహిస్తున్న వైద్యసేవల వివరాలను ఎప్పటికప్పుడు ఇ- ఆశా మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించే ఎన్సిడి సర్వే వివరాలపై ఆరా తీశారు. స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో విద్యార్థుల్లో ఏమైనా అనారోగ్య లక్షణాలు గుర్తించారా, రక్తహీనతతో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు వివరాలపై సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించి తగు చికిత్స అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ ధరణి, డిఎస్ఒ శంకర్, సూపర్వైజర్లు వెంకటనాయుడు, జయలక్ష్మి, శంకర్రావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీల వివరాలు అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

స్వర్ణ గ్రామ పంచాయతీల వివరాలు అప్‌లోడ్ చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. స్వర్ణ గ్రామ పంచాయతీల వివరాలు అప్‌లోడ్‌పై మండలంలో మంగళవారం జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తనిఖీ చేశారు. జిల్లాలో గ్రామ పంచాయతీల్లో అసెస్మెంట్ (ఆస్తుల) వివరాలను స్వర్ణ గ్రామ పంచాయతీల పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో 1,87,559 అసెస్మెంట్ ఉన్నాయని, వాటిలో 1,12,637 అసెస్మెంట్‌ను నమోదు చేస్తున్నామని చెప్పారు. 2036 అసెస్మెంట్‌ను పాక్షికంగా నమోదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ సిబ్బంది త్వరగా అప్ లోడ్ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో 'సంకల్పం'

ప్రజాశక్తి - సీతంపేట



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, 15 సూత్రాల గురించి వివరించారు. గుట్కా, పాన్, ఖైనీ, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. మహిళ చట్టాలు, భద్రత గురించి వివరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, హెచ్ఎం బి.ఉమావాణి డిప్యూటీ వార్డెన్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తతో ఉండాలని స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని బక్కుపేటలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీను, కానిస్టేబుల్. గ్రామస్తులు పాల్గొన్నారు.

పూతికవలసలో శ్రమదానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పూతికవలస రహదారిపై గిరిజనులు మంగళవారం శ్రమదానం చేశారు. వాహన చోదకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్రామస్తులు రోడ్డుకు ఇరువైపులా డొంకలు కొట్టి శ్రమదానం నిర్వహించారు. ఎటువంటి ప్రమాదాలు జరగడా రహదారి కనుచూపు మేర కనిపించేలా ఐక్యంతో డొంకలు కొట్టి జంగిల్ క్లీనింగ్ చేశారు

కిశోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

ప్రజాశక్తి - పాచిపెంట

కిశోర బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ మణి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కిశోర వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలపై కిశోర బాలికలకు మహిళా పోలీసులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. డ్రాపౌట్స్ ఉంటే తిరిగి బడిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా కిశోర బాలికల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ బొత్స అనంతలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, ఎంఇఒ పి.జోగారావు, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : బాల్యవివాహాల పై గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి కోరారు. స్థానిక వైటిసిలో కిశోర బాలికల వికాసంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల అనారోగ్య సమస్యలతో పాటు పుట్టబోయే పిల్లల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని చెప్పారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడితే కఠిన చర్యలు వుంటాయని, పోక్సో లాంటి చట్టం కింద కేసు నమోదు చేయవచ్చునని చెప్పారు. మామిడిపల్లి పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఎంపిడిఒ రమాదేవి, రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి కూడా అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి, నోడల్ అధికారి ఎన్.రాజ్యలక్ష్మి, డిసిపిఒ సత్యనారాయణ, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రీడలతో పిల్లల మానసిక ఎదుగుదల

ప్రజాశక్తి - కురుపాం



వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్

క్రీడలతోనే ప్రత్యేక అవసరాల పిల్లలు మానసిక ఎదుగుదల దోహదపడతాయని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన వికలాంగుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగుల పిల్లలకు క్రీడలు, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించాలని, వాటి వల్ల వారి మానసిక ఎదుగుదలకు ఎంతోగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎన్. రాధాకృష్ణ మూర్తి, జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. శంకర్రావు, భవిత కేంద్ర సిబ్బంది గౌరీశ్వరి మాత, నక్కెళ్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

సాలూరు: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక వైటిసిలో నిర్వహించిన కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ దివ్యాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసింది. నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ వికలాంగులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ మోహన్ పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : వికలాంగులైన పిల్లలను వారి ఎదుగులకు ప్రోత్సహించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఇఒ పి.దాసు కోరారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు, తల్లితండ్రులతో మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం అన్ని సహాయ, సహకారలందిస్తుందని, కావున వారిని చదువుకు దూరంగా పెట్టకుండా చూడాలని అన్నారు. సమగ్ర శిక్ష ద్వారా ఎస్కార్ట్ అల్లివెన్స్ లు, రవాణా అలెవెన్స్లు లు, గర్ల్స్ స్టైఫండ్, ఇంటి దగ్గ ఉన్నవారికి కూడా ప్రభుత్వం తరుపున ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేస్తారని, వీటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భామిని : వికలాంగుల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవనానికి, అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఎంఇఒ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వికలాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, సహిత విద్య ఉపాధ్యాయులు సురేష్, వెంకటరావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఇఒ జి.సూర్యదేవుడు ప్రభుత్వం వికలాంగులు అందించే సహాయ సహకారాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్ను, నోటు పుస్తకాలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో వికలాంగ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : వికలాంగులు ఆత్మ స్థైర్యంతో ముందుకు నడవాలని ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యంగుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.వెంకటరమణ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పొట్నూరు దుర్గారావు మనవడు రఘువీరు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా స్పెషల్ టీచర్ గంగాధర్‌కు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరా కేపీ నాగమణి, నారాయణరావు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది వాసు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : వికలాంగ పిల్లలకు మంచి బోధనతోనే వారి భవితవ్యం ఉంటుందని ఎంఇఒ టి.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు ఉన్న హక్కులు, రిజర్వేషన్లు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి ప్రకాష్‌దొర, ఐఇఆర్‌టి సభ్యులు టి.సాయిలత, రవి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.